రాయలసీమ ప్రాజెక్టును అడ్డుకోవాలి

పనులు చేపట్టకుండా ఏపీని నిలువరించాలి

- వెంటనే క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును సందర్శించాలి
- ఎన్జీటీకి, కేంద్రానికి నివేదిక సమర్పించాలి
- తెలంగాణ హక్కులను పరిరక్షించాలి
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్‌తో కేఆర్‌ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ట్రిబ్యునల్ అవార్డులను, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం నిరాటంకంగా నిర్వహిస్తున్న రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్) పనులను వెంటనే అడ్డుకోవాలని తెలంగాణ సర్కారు డిమాండ్ చేసింది. వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పనులను పరిశీలించాలని, సంబంధిత నివేదికను కేంద్రానికి, ఎన్జీటీకి సమర్పించాలని కోరింది. ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు తెలంగాణ ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్ బుధవారం లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఆర్ఎల్ఐఎస్, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణ పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నది. కేంద్ర జలశక్తిశాఖ ఆదేశాలను, ఎన్జీటీ ఉత్తర్వులను తుంగలో తొక్కి అర్ధరాత్రి వేళ ఫ్లడ్ లైట్ల వెలుతురులో ప్రాజెక్టు పనులను నిర్వహిస్తున్నది. కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తర్వాత కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్న ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లనున్నది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం అనేకసార్లు కేఆర్ఎంబీకి, కేంద్రానికి ఫిర్యాదు చేయడంతోపాటు ఎన్జీటీలోనూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో వాస్తవాలను తేల్చేందుకు ఎన్జీటీ కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఏపీ ప్రభుత్వం చెప్తున్నవన్నీ అబద్ధాలేనని ఆ కమిటీ సైతం నివేదించడంతో.. పర్యావరణ అనుమతులు పొందేవరకూ ఆర్ఎల్ఐఎస్ పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీకి కూడా ఎలాంటి తవ్వకాలను జరుపవద్దని స్పష్టం చేస్తూ ఎన్జీటీ 2021డిసెంబర్‌లో ఏపీకి ఆదేశాలను జారీ చేసింది. ఆ ఆదేశాలను, నిబంధనలను ఉల్లంఘించి పనులను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి కొద్దిరోజులుగా ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించింది. దీనిపై 'దొంగరాత్రి సీమ లిఫ్ట్ పనులు' పేరుతో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.

ఏపీని ఎండగట్టేందుకు కసరత్తు

ఏపీ తీరును అన్ని వేదికలపై ఎండగట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఎన్జీటీ ఉత్తర్వులను ఉల్లంఘించి ఏపీ పనులు చేపట్టిన విషయాన్ని వెంటనే కేంద్ర జలశక్తిశాఖ దృష్టికి తీసుకువెళ్లాలని యోచిస్తున్నది. ఈ మేరకు ఇంజినీర్లు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. అదేవిధంగా ఏపీ ఉల్లంఘనపై మరోసారి ఎన్జీటీని ఆశ్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. దీనితోపాటుగా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం.

శ్మశానం కబ్జాపై విచారణ

- 'నమస్తే' కథనానికి స్పందన

రాజాపూర్, డిసెంబర్ 20 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఇప్పటూర్ గ్రామ శివారులో దళితుల శ్మశానవాటిక కబ్జాకు గురైందన్న వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రాజాపూర్ రెవెన్యూ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. దోండ్లపల్లి గ్రామ శివారులోని భూమి పట్టా పొలమని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ భూమిలో దళితులకు సంబంధించి ఎలాంటి సమాధులు లేవని ఆయన పేర్కొన్నారు. కాగా అధికారుల తీరుపై దళితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కబ్జా విషయమై అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించాలని వారు సూచించారు.

రాహుల్‌గాంధీ ప్రకటనలూ నకిలీవేనా?

- పత్రికలకు మీరిచ్చిన ప్రకటనలన్నీ అసత్యాలేనా?
- ప్రియాంక్ ఖర్గేకు కేటీఆర్ ప్రశ్న
- కాంగ్రెస్ హామీలపై ట్విట్టర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడి కుమారుడు ప్రియాంక్, కేటీఆర్ సంవాదం

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల 'ట్విట్టర్' వార్ ఇంకా చల్లారలేదు. తాజాగా కర్ణాటక మంత్రి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే కూడా ఇందులోకి ఎంటరయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు తోడుదొంగలుగా మారి తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నట్టు బుధవారం ప్రియాంక్ ఎక్స్ వేదికగా విమర్శించారు. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ ఘాటుగా స్పందించారు. 'మీరు కూడా ఈ వ్యవహారంలో చేరాలనుకున్నందుకు సంతోషం. రెండు లక్షల మంది కర్ణాటక యువతకు ఉపాధి గురించి మీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనలు, అలాగే ఖజానా ఖాళీపై డిప్యూటీ సీఎం చేసిన ప్రకటనలు కూడా నకిలీవేనా?' అని ట్విట్టర్‌లో సూటిగా ప్రశ్నించారు. 'మేము కాంగ్రెస్ పార్టీనికాదు, బీజేపీలోని ముగ్గురు ఎంపీలు సహా తెలంగాణలో ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ ఓడించాం. మేము, బీజేపీ ఒక్కటి కాదు అనేందుకు ఇది నిదర్శనం. సునీల్ (కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహకర్త), ఆయన బృందం చెప్పినవి గుడ్డిగా అనుకరించకుండా, అవి చెప్పేముందు మీరు కొంత జాగ్రత్తగా సన్నద్ధులైతే మంచిది' అని హితవు పలికారు. రెండు లక్షల ఉద్యోగాల మాటను కర్ణాటక ప్రభుత్వం మర్చిపోయిందని పత్రికల్లో వచ్చిన కథనాలు, ఈ ఏడాది అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేమని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ చేసిన ప్రకటనలు, ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలు, ఎస్సీ-ఎస్టీ సంక్షేమ నిధులను ఎన్నికల హామీలను నెరవేర్చుకునేందు కు వాడుకుంటామని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య చేసిన ప్రకటనలు, తదితర వార్తల క్లిప్పింగులను కేటీఆర్ ట్వీట్‌తో పాటు జత చేశారు.

ట్వీట్ల వార్ ఇలా మొదలైంది!

'ఎన్నికల సందర్భంగా చెప్పినవన్నీ చేయాలా? చేయాలంటే ఖజానాలో డబ్బు కావాలి కదా? ఎన్నికల సందర్భంగా చెప్పినంతమాత్రాన అన్నీ ఫ్రీగా ఇవ్వాలా?' అంటూ కర్నాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో మాట్లాడినట్టుగా ఓ వీడియో వైరల్ అయ్యింది. ఆ వీడియోను కేటీఆర్ మంగళవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ 'తెలంగాణలో కూడా పరిస్థితి ఇలాగే ఉంటుందా?' అని సందేహం వ్యక్తంచేశారు. దీనిపై సిద్ధరామయ్య స్పందిస్తూ, అది బీజేపీ తయారుచేసిన ఎడిటెడ్ ఫేక్ వీడియో అని స్పష్టం చేశారు. దీన్ని కేటీఆర్ తిప్పుకొడుతూ.. 'అబద్ధపు హామీలతో మీ పార్టీవాళ్లు (కాంగ్రెస్) తెలంగాణ ప్రజలను మోసం చేశారు. కాబట్టే మేము ఎన్నికల్లో ఓడిపోయాం. డిసెంబర్ 9న ఎన్నికల హామీలు అమలుచేస్తామని, హామీలపై చట్టాలు చేస్తామని చేసిన ప్రకటనలు ఏమయ్యాయి? డిసెంబర్ 9 దాటి 10 రోజులు గడిచినా మీ పార్టీ ఇచ్చిన హామీలు ఇంతవరకూ నెరవేరలేదు.' అని విమర్శించారు. తెలంగాణలో ఇచ్చిన ఒక్కో హామీపై ప్రశ్నలు సంధించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే ఈ ఇష్యూలో తలదూర్చగా, కేటీఆర్ దీటుగా సమాధానమిచ్చారు.

11 రోజుల్లో 3 కోట్ల మహిళల ప్రయాణం

- మహాలక్ష్మి-ఉచిత బస్సు స్కీమ్‌కు అనూహ్య స్పందన
- మహిళలు కండక్టర్‌కు ఒరిజినల్ ఐడీ చూపించాలి
- రోజూ సగటున 30 లక్షల (62%) మంది మహిళలే
- త్వరలో 2,050 కొత్త బస్సులు: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఉచిత బస్సు పథకానికి అనూహ్య స్పందన వస్తున్నదని, స్కీమ్ అమల్లోకి వచ్చిన 11 రోజుల్లోనే రికార్డుస్థాయిలో 3 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చెప్పారు. రోజూ సగటున 30 లక్షల మంది మహిళలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. పురుషులతో కలుపుకొంటే ప్రతి రోజూ 51 లక్షల మందిని ఆర్టీసీ గమ్యస్థానాలకు చేర్చుతున్నదని, ప్రయాణికుల్లో 62 శాతం మంది మహిళలే ఉంటున్నారని వివరించారు. మహిళలు కండక్టర్‌కు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఒరిజినల్ ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డులను చూపించి జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. ఫొటో కాపీలు, స్మార్ట్‌ఫోన్లలో చూపిస్తే ఉచిత ప్రయాణానికి అనుమతి ఉండదని తేల్చిచెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలకే ఈ స్కీమ్ వర్తిస్తుందని, ఇతర రాష్ట్రాల మహిళలు విధిగా చార్జీలు చెల్లించి టికెట్ తీసుకోవాలని స్పష్టంచేశారు. జీరో టికెట్ల విషయంలో మహిళలు నిర్లక్ష్యంగా ఉండొద్దని, జీరో టికెట్‌ను జారీచేస్తేనే ఆ చార్జీని ఆర్టీసీకి ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని చెప్పారు. బస్సుల్లో వెనుక లాడర్ పైన ఎక్కి ప్రమాదకర రీతిలో ప్రయాణించడం సరికాదని, రద్దీ సమయాల్లో తమ సిబ్బందికి సహకరించాలని ప్రయాణికులను కోరారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నాలుగైదు నెలల్లో 2,050 కొత్త బస్సులు విడతలవారీగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఉచిత ప్రయాణ స్కీమ్ ఫలితంగా సంస్థ ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంలో 69 శాతం ఓఆర్ ఉండగా.. ప్రస్తుతం అది 88 శాతానికి పెరిగిందని తెలిపారు. ఈ నెల 16న 17 డిపోలు, 17న 20 డిపోలు, 18న 45 డిపోల్లో 100 శాతానికిపైగా ఓఆర్ నమోదైందని పేర్కొన్నారు. అతి తక్కువ టైంలోనే స్కీమ్‌ను అర్థంచేసుకొని విజయవంతంగా అమలు చేస్తున్న సిబ్బందిని ఆయన ప్రశంసించారు.

మా కుటుంబాలను పోషించుకునేదెట్లా?

- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో రోడ్డున పడ్డాం
- ఆదుకోవాలని సర్కారుకు ఆటో డ్రైవర్ల వినతి
- పలుచోట్ల ఆటోల బంద్.. ధర్నాలు, నిరసన ర్యాలీలు

బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 20: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో తమకు నెలకు రూ. 15వేల జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్కార్ తీరును నిరసిస్తూ బుధవారం పలు జిల్లాల్లో నిరసనలు చేపట్టారు. ఆటోలతో బంద్ పాటించారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి పాత ఏటీఎం సెంటర్ వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ తీశారు. జైనూర్ మండల కేంద్రంలో 100 ఆటోలతో ర్యాలీ తీసి, రోడ్డుపై బైఠాయించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో ఆటోల బంద్ నిర్వహించి, లింగోజి తండా ఎక్స్ రోడ్డు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇంద్రవెల్లి మండలంలోనూ ఆటోల యజమానులు, డ్రైవర్లు బంద్ పాటించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని జమ్మికుంట రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు సిరికొండ శరత్, మాజీ అధ్యక్షుడు ఎస్‌కే ఫయాజ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ తీశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సుమారు 100 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేయడంతో నాలుగు వైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. సీఐటీయూ నేత నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శ్వేతపత్రం కాదు.. అబద్ధాల పత్రం

- వందరోజులకు ముందే కాంగ్రెస్ సర్కారుకు కౌంట్‌డౌన్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసింది.. శ్వేతపత్రం కాదని, అబద్ధాలతో కూడిన తప్పుడు పత్రమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ రాజకీయ అజెండాకు అనుగుణంగా ఆర్థిక అంశాలను చేర్చడానికి ప్రయత్నించిందని ఆయన ట్విట్టర్ వేదికగా తెలిపారు. కేవలం తొమ్మిదేండ్లలోనే తెలంగాణను ఎంతో విజయవంతంమైన రాష్ట్రంగా తీర్చిదిద్దితే.. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఆ ప్రతిష్ఠను దిగజార్చాలనుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తెలంగాణ నష్టాల్లో ఉంటే కొత్తగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఎంసీహెచ్ఆర్డీలో కొత్త క్యాంపు కార్యాలయానికి ఎందుకు డబ్బు వృథా చేస్తున్నారని, న్యూఢిల్లీలో తెలంగాణ భవన్ ఎందుకు నిర్మించాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. 100 రోజుల్లో ఆరు హామీలను అమలు చేస్తామన్న సర్కారు దానికి ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిలదీశారు. 100 రోజులు కాకముందే ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని కేటీఆర్ హెచ్చరించారు.

డ్రగ్ పెడ్లర్స్ రాష్ట్రాన్ని వదిలివెళ్లిపోవాలి

- ఎక్స్ వేదికగా డీజీపీ హెచ్చరిక
- డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదామని రాష్ట్ర ప్రజలకు రవిగుప్తా పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందని, డ్రగ్స్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని డీజీపీ రవిగుప్తా పిలుపునిచ్చారు. ఈ విషయమై ఆయన బుధవారం ట్విటర్ (ఎక్స్) వేదికగా డ్రగ్స్ పెడ్లర్స్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించేందుకు మాదకద్రవ్యాల వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారు తక్షణమే రాష్ట్రాన్ని విడిచి వెళ్లాలని సూచించారు. నిబంధనలు ఉల్లింఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ భూతాన్ని పారదోలేందుకు పోలీసు విభాగాలు పరస్పరం సహకరించుకోవాలని, ప్రజలు సైతం భాగస్వామ్యం కావాలని డీజీపీ కోరారు. ఈ పోస్టుకు లక్షల్లో వ్యూస్ రాగా.. చాలా మంది నెటిజన్స్ సలహాలు, సూచనలు ఇచ్చారు. డ్రగ్స్‌పై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని, ఇన్‌ఫార్మర్ల వివరాలు గోప్యంగా ఉంచి రివార్డులు అందించాలని ఓ నెటిజన్ కోరాడు. డ్రగ్స్‌కు బానిసైన వారికోసం డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని మరో నెటిజన్ కోరాడు. ప్రస్తుతం పోస్టల్, కొరియర్, పార్సిల్ సర్వీసుల ద్వారా డ్రగ్స్ డెలివరీ అధికంగా జరుగుతున్నదని, దానిపై దృష్టి పెట్టాలని కోరారు.

పోలీస్‌శాఖకు సాంకేతిక హంగులద్దిన డీజీపీ

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రానికి నాలుగో డీజీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన రవిగుప్తా రాష్ట్ర పోలీస్ శాఖలో విశిష్ట సేవలందిస్తూ వచ్చారు. సాంకేతిక హంగులు అద్దడంలో ఆయన తనదైన పాత్ర పోషించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పౌడీకి చెందిన రవిగుప్తా 1965 డిసెంబర్ 19న జన్మించారు. 1987లో ఐఐటీ కాన్పూర్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చేశారు. అక్కడే మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశారు. ఆ తర్వాత ఇండియన్ రైల్వే సర్వీసెస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్ (ఐఆర్ఎస్ఎంఈ)లో 1989 నుంచి 1990 వరకు పనిచేశారు. అనంతరం 1990లో ఐపీఎస్ సాధించిన ఆయన ఏపీ క్యాడర్‌కు వచ్చారు. ఐపీఎస్‌గా కెరీర్ మొదట్లోనే వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో కీలక పాత్ర పోషించారు. లా అండ్ ఆర్డర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేశారు. ఉమ్మడి ఏపీలో 2010 నుంచి పోలీస్ కంప్యూటర్స్ సర్వీసెస్ అండ్ స్టాండర్డైజేషన్‌కు బదిలీ అయిన రవిగుప్తా సీసీటీఎన్ ప్రాజెక్ట్‌లో కొత్త సాంకేతికతను తీసుకొచ్చారు. ఆ తర్వాత వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించిన రవిగుప్తా ఈ నెల 3న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 19 నాటి పూర్తిస్థాయి డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డీజీపీ రవిగుప్తాను వరించిన అవార్డులు

సంవత్సరం	అవార్డు
2007	ఇండియన్ పోలీస్ మెడల్
2015	రాష్ట్రపతి పోలీస్ మెడల్
2021	అతి-ఉత్కృష్ట్ సేవా పతక్

కరోనా అడ్డుకట్టకు ముందస్తు చర్యలు

- వైరస్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి
- అన్ని దవాఖానల్లో కొవిడ్ పరీక్షలు
- శ్వాసకోశ బాధితులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలు ఆందోళన చెందొద్దు
- సమీక్షలో మంత్రి దామోదర

హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఫీవర్ దవాఖానలో కరోనా రోగులకు ప్రత్యేక బెడ్లు, చికిత్సకు అవసరమయ్యే వైద్య పరికరాలను ఏర్పాటు చేస్తున్న వైద్య సిబ్బంది

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బందికి మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన వైద్యాశాఖాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొవిడ్ పరీక్షలు, చికిత్స పరికరాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా కొరత ఉంటే టీఎస్ ఎంఎస్ఐడీసీ నుంచి సమకూర్చుకోవాలని చెప్పారు. మాక్ డ్రిల్‌ను వెంటనే పూర్తిచేయాలని, దవాఖానల సన్నద్ధతకు సంబంధించిన వివరాలను కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఇన్‌ఫ్లుయెంజా మాదిరిగా శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దవాఖానలు, జిల్లా స్థాయిలో విభాగాధిపతులు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విధిగా నమూనాలను ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నోస్టిక్స్(సీడీఎఫ్‌డీ)కు పంపాలని తెలిపారు. శనివారం మరోసారి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి వెల్లడించారు.

తొమ్మిది యాక్టివ్ కేసులు

రాష్ట్రంలో ప్రస్తుతం తొమ్మిది యాక్టివ్ కేసులు ఉన్నట్టు మంత్రి దామోదర రాజనర్సింహకు అధికారులు తెలిపారు. బాధితుల్లో ఎవరికీ తీవ్రమైన లక్షణాలు లేవని, వారంతా ఇంట్లోనే ఐసోలేషన్‌లో కోలుకొంటున్నారని చెప్పారు. బుధవారం 319 కొవిడ్ పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి పాజిటివ్‌గా తేలిందని చెప్పారు. అంతకుముందు.. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మండవీయ అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. రాష్ట్రంలో కరోనా కొత్త వెరియంట్ జేఎన్-1 మహమ్మారి కట్టడికి ముందస్తు చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు.

పెరుగుతున్న కేసులు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం నాలుగు కేసులు నమోదుకాగా, బుధవారం కొత్తగా ఆరు కరోనా కేసులు వెలుగు చూశాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోనే నమోదయ్యాయి. ఈ నెల 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 14 కేసులు వెలుగు చూశాయి. ఇందులో 13 కేసులు హైదరాబాద్‌లో రాగా, ఒకటి కరీంనగర్‌లో నమోదైంది. వారందరూ ఇండ్లలోనే చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు మరణాలు నమోదు కాలేదని, ఒకరు కోలుకొని డిశ్చార్జి అయ్యారు.

వైద్యశాఖకు సవాల్?

జేఎన్-1 వేరియంట్‌తో కొవిడ్ ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో.. వైద్యశాఖకు సవాల్‌గా మారనున్నది. వైద్యారోగ్య శాఖలో మంత్రి మొదలు కీలక పదవులన్నింటిలో కొత్తవారే కొలువుదీరారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పడగా, మంత్రి దామోదర రాజనర్సింహా ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొవిడ్ సమయంలో పనిచేసిన అధికారులెవరూ ఇప్పుడు అందుబాటులో లేరు.

పార్కు వద్ద బహుళ అంతస్తులెలా నిర్మిస్తారు!

ప్రభుత్వంతోపాటు జీహెచ్ఎంసీ, నిర్మాణ సంస్థకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరం నందగిరిహిల్స్‌లోని ప్లాట్ నంబర్-1లో వాణిజ్య భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను హైకోర్టు బుధవారం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీతోపాటు నిర్మాణ సంస్థ నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. 'జూబ్లీహిల్స్‌లో భాగమైన నందగిరిహిల్స్‌లోని ప్లాట్ నంబర్-1లో నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమంగా భారీ బహుళ వాణిజ్య నిర్మాణాన్ని చేయడాన్ని సవాల్ చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణ చేపట్టింది. కేబీఆర్ జాతీయ పార్కును పర్యావరణ సున్నిత ప్రాంతంగా కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఏ విధంగా నిర్మాణాలు చేస్తున్నారో చెప్పాలని కోరింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలు పాటు వాయిదా వేసింది.

సీఐడీ చీఫ్‌గా శిఖాగోయెల్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీసు శాఖలో అత్యంత కీలక విభాగమైన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) చీఫ్‌గా శిఖాగోయెల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సీఐడీ సిబ్బంది అభినందనలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ఆమె తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏడీజీగా కొనసాగుతున్న ఆమెకు సీఐడీ చీఫ్‌గా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా, టెక్నికల్ సర్వీసెస్ అదనపు డీజీపీగా, ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో మంగళవారం ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.

దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు ఏడు అవార్డులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలం